సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 28 । నవంబర్ । 2023



తెల్లారే వరకు..

తగరపువలసలో జశ్వంత్ రడీమేడ్స్‌లో జరిగిన ప్రమాదంలో మంటలు సోమవారం వరకు కొనసాగాయి

8లో



అర్జీలకు తక్షణ పరిష్కారం

సమస్యల పరిష్కార దిశగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం అర్జీలు తక్షణం పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు

8లో



కార్తీక సోమవారం పూజలు నగరంలో శివాలయాల్లో జరిగాయి. మహిళలు ధ్వజస్తంభాల వద్ద దీపారాధన చేశారు.



ముగిసిన థియేటర్ ఫెస్ట్‘వెల్’

మూడు రోజులుగా వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో జరుగుతున్న వైజాగ్ జూనియర్ థియేటర్ ఫెస్ట్ సోమవారంతో ముగిసింది. తారస్ ట్రియో, మాల్గుడి డేస్, బరిబతల రాజా నాటికలు పిల్లలకు వినోదంతో పాటు సమాజంపై అవగాహన పెంపొందించాయి. చక్కటి సందేశాత్మక నాటికలను ప్రదర్శించడంతో విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.

8లో

పుష్కరిణీ నమోస్తుతే..



స్వామి వారికి హారతి ఇస్తున్న ఆలయ అర్చకుడు, చిత్రంలో స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ



కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కొండదిగువ గల వరాహ పుష్కరిణికి సంప్రదాయబద్ధంగా పుణ్యనదీ హారతి ఇచ్చారు. స్థానాచార్యులు డా.టీపీ రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో పుష్కరిణిలోని జలాలకు షోడశోపచార పూజలు చేశారు. అష్ట హారతి, నక్షత్ర హారతులను పుష్కరిణికి సమర్పించారు.

8లో

న్యూస్‌రీల్

కనకమహాలక్ష్మికి బంగారు ఆభరణాల వితరణ




ఆలయ ఈవోకు బంగారు ఆభరణాలు అందజేస్తున్న దాతలు

దాబాగార్డెన్స్: నగరానికి చెందిన మంత్రినీత గణపతి, కుటుంబ సభ్యులు బురుజుపేట కనకమహాలక్ష్మికి సోమవారం బంగారు ఆభరణాలు బహూకరించారు. 67 గ్రాముల 200 మిల్లీగ్రాముల బంగారు గొలుసు, ఒక తెల్లరాళ్ల బంగారు మామిడి పిందెల నెక్లెస్‌ను ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీషకు అందజేశారు. వీరికి అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు ఎం.ధనలత, బి.అనురాధ, ఎస్.సతీష్, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు దిశ కమిటీ సమావేశం

మహారాణిపేట: కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, నిర్వహణపై కలెక్టర్ మల్లికార్జున మంగళవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో దిశ కమిటీ సమావేశం నిర్వహించనున్నారని జిల్లా పరిషత్ సీఈవో ఎం.పోలినాయుడు తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాకు చెందిన ఎంపీలు,ఎమ్మెల్సీలు,ఎమ్మెల్యేలు, దిశా కమిటీ సభ్యులు, అధికారులు హాజరు కానున్నారు.

తల్లిదండ్రులను మించిన దైవం లేదు



ప్రవచనాలు చెబుతున్న గరికిపాటి

మల్కాపురం : తల్లిదండ్రులను మించిన దైవం లేదు..వారిని గౌరవించి ముందుకు సాగితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రవచనకర్త గరికిపాటి నరసింహారావు అన్నారు. మల్కాపురం, ప్రకాష్‌నగర్‌లో స్ఫూర్తి టీమ్ ఆధ్వర్యంలో గరికిపాటి ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత కార్తీకమాస విశిష్టతను తెలియజెప్పారు. అనంతరం విద్యార్థులు సమయాన్ని వృథా చేయవద్దని, తమ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. మనసు ఎప్పుడూ నిర్మలంగా ఉంచుకోవాలన్నారు. దైవారాధన, తల్లిదండ్రుల సేవను యువత విస్మరించవద్దన్నారు.

10న మిస్టర్ విశాఖ బాడీ బిల్డింగ్ పోటీలు



మిస్టర్ విశాఖ బాడీబిల్డింగ్ పోటీల పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాజారావు

పెదగంట్యాడ: వచ్చే నెల 10న విశాఖ నగరంలోని మద్రిపాలెం కరాసలో 2వ మిస్టర్ విశాఖ బాడీబిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నామని విశాఖ బాడీబిల్డర్స్ అండ్ ఫిట్‌నెస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సవలాపురపు రాజారావు తెలిపారు. ఈ మేరకు పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను పెదగంట్యాడలోని ఆర్కే ఫిట్‌నెస్ జిమ్ ఆవరణలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్కే ఫిట్‌నెస్ జిమ్ అధినేత ఆర్కే గున్న ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీల్లో విజేతలకు చాంపియన్ ఆఫ్ చాంపియన్ పేరుతో బంగారు పతకాలు అందజేయనున్నామని తెలిపారు.

పక్కాగా ఓటర్ల జాబితా

- ఓటరు జాబితా ముసాయిదాపై అభ్యంతరాల స్వీకరణ
- గత నెల 27 నుంచి ఇప్పటివరకు 1.99 లక్షల అభ్యంతరాలు
- డిసెంబర్ 9 వరకు అభ్యంతరాల స్వీకరణ



సాక్షి, విశాఖపట్నం: సార్వత్రిక ఎన్నికలు-2024 నిర్వహణకు సంబంధించి ఒక్కో ప్రక్రియ పూర్తవుతోంది. పాత ఓటర్ల జాబితా మదింపు తర్వాత విడుదల చేసిన ఓటరు జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్‌పై జిల్లా ఎన్నికల యంత్రాంగం అభ్యంతరాలు స్వీకరిస్తోంది. 43 రోజుల పాటు అంటే డిసెంబర్ 9 వ తేదీ వరకు ముసాయిదాపై ఓటర్ల నుంచి అభ్యంతరాలు, సలహాలను స్వీకరించనున్నారు. ప్రతీ నియోజకవర్గం నుంచి భారీగానే అభ్యంతరాలు వచ్చిన నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున ఆదేశాలతో వాటన్నింటినీ క్షేత్ర స్థాయిలో పరిశీలించి..పరిష్కరిస్తున్నారు. వచ్చిన ప్రతి అభ్యంతరాన్ని బీఎల్‌వోలు ఓటరు వద్దకు వెళ్లి వివరాలు సేకరించి.. వారు సంతృప్తి చెందిన అనంతరం క్లియర్ చేస్తున్నారు. ఓటర్ల నుంచి వచ్చిన క్లెయిమ్స్‌ను అనుసరించి.. అవసరమైన ఫాంను నింపి.. దాని ప్రకారం సదరు ఓటరుకు సంబంధించిన మార్పులు చేర్పులు ఏమైనా ఉంటే అధికారులు సవరిస్తున్నారు. డిసెంబర్ 9వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ చేపట్టనున్నారు.

డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు

ఈ సారి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు ఎన్నికల యంత్రాంగం శ్రమిస్తోంది. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇప్పటికే ఈ నెలలో రెండు రోజుల పాటు బూత్ స్థాయిలో క్యాంపులు ఏర్పాటు చేయగా విశేష స్పందన లభించింది. ఇదే స్ఫూర్తితో చివరిసారిగా డిసెంబర్ 2, 3 తేదీల్లో బూత్ స్థాయిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి అభ్యంతరాలు స్వీకరించే బాధ్యతను బీఎల్‌వోలకు అప్పగించారు. ఈఆర్వోలు పర్యవేక్షించనున్నారు. డోర్ టూ డోర్ సర్వే సమయంలో వచ్చిన అభ్యంతరాల్లో పరిష్కరించాల్సినవి 80 వేలు ఉండగా.. గత నెల 27న ముసాయిదా ప్రకటించినప్పటి నుంచి ఇప్పటి వరకు మరో 1.12 లక్షలు వచ్చాయి. వీటిలో ఈ నెల 24 వరకు 1.23 లక్షల దరఖాస్తులను పరిష్కరించారు.

ఆ ఓట్లపై ప్రధాన దృష్టి

2019 ఎన్నికల సమయంలో కేవలం 72 రోజుల్లోనే లక్షల ఓట్లను అప్పటి తెలుగుదేశం నేతలు అడ్డగోలుగా చేర్పించేశారు. దీంతో ఓటర్ల సంఖ్య అమాంతం పెరిగిపోయింది. డోర్ టూ డోర్ సర్వేతో పాటు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఇలాంటి ఓట్లని తొలగిస్తున్నారు. ఒకే ఇంటి డోర్ నంబర్‌తో 10 కంటే ఎక్కువ ఓట్లు ఉన్న వాటిని గుర్తించారు. ఇలాంటి పాయింట్లు 2019 ఓటర్ల జాబితాలో ఏకంగా 1.90 లక్షలు ఉన్నాయి. వీటన్నింటినీ అధికారులు స్క్రూటినీ చేశారు. ఇలాంటి ఇళ్లు ప్రస్తుతం కేవలం 15 వేలు మాత్రమే ఉన్నాయి. అదే విధంగా.. కొందరు ఓటర్లకు సంబంధించిన కార్డులు, జాబితాలో పొందుపరిచిన చిరునామాలో డోర్ నంబర్ లేనివి కూడా గుర్తించారు. ఇలా డబులింగ్ ఓట్లు, చిరునామాలో లేకపోయినా ఉన్నట్లుగా చూపించిన ఓట్లన్నింటినీ అధికారులు తొలగించారు. మరోవైపు 2024 జనవరి 1న ముసాయిదా ఓటర్ల జాబితా సవరణ, తనిఖీ ప్రక్రియ జరుగుతోంది. జనవరి 5న ఎన్నికల కమిషన్ తుది జాబితాని ప్రకటిస్తుంది. ఈ జాబితా ప్రకారమే ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల అధికారులు ప్రతీ ఒక్క ఓటును నిశితంగా పరిశీలించి చర్యలు చేపడుతున్నారు. తప్పులు లేని జాబితా తయారు చేసేందుకు సమన్వయంతో పని చేస్తున్నారు.

శతశాతం దరఖాస్తులు పరిష్కరిస్తాం



డిసెంబర్ 9 లోపు వచ్చే ప్రతీ దరఖాస్తుని పరిగణనలోకి తీసుకుంటాం.డిసెంబర్ 26 వరకు అభ్యంతరాల పరిష్కారానికి సమయం ఉండటంతో శతశాతం క్లియర్ చేస్తాం. ఫారం-6, 7, 8 పెండింగ్ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాం. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ కూడా వేగవంతం చేశాం. భార్యాభర్తలకు ఒకే పోలింగ్ బూత్‌లో ఓటు లేకపోతే.. వారి ఊరిలోనే ఫారం-8 దరఖాస్తు చేస్తే వేరే పోలింగ్ బూత్‌లో ఉన్న ఓటును తొలగిస్తాం. డిసెంబర్ 2,3 తేదీల్లో బూత్ స్థాయిలో ఏర్పాటు చేస్తున్న శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి.

– కె.మోహన్‌కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి

గత నెల 27 నుంచి ఈ నెల 24 వరకు నియోజకవర్గాల వారీగా వచ్చిన అభ్యంతరాలు, పరిష్కరించిన వివరాలను పరిశీలిస్తే..

నియోజకవర్గం	ఫారం-6	పరిష్కారం	బ్యాలెన్స్	ఫారం-7	పరిష్కారం	బ్యాలెన్స్	ఫారం-8	బ్యాలెన్స్	పరిష్కారం
భీమిలి	3313	2000	1313	4598	2460	2138	9953	6490	3463
విశాఖ తూర్పు	6221	993	5228	4084	555	3529	15874	9098	6776
విశాఖ దక్షిణం	1859	597	1262	3129	865	2264	7034	4425	2609
విశాఖ ఉత్తరం	2995	873	2122	2679	02	2677	9727	4215	5512
విశాఖ పశ్చిమం	1900	811	1089	4918	1423	3495	7156	4190	2966
గాజువాక	3774	1336	2438	3373	646	2727	8513	5892	2621
పెందుర్తి	2849	681	2168	3677	1038	2639	4972	3398	1574
మొత్తం	22911	7291	15620	26458	6989	19469	63229	37708	25521

ప్రతిష్టాత్మకంగా ‘ఆడుదాం ఆంధ్ర’

- లోగో ఆవిష్కరించిన కలెక్టర్ మల్లికార్జున
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల ప్రారంభం



లోగో విడుదల చేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

విశాఖ స్పోర్ట్స్ : ప్రతిష్టాత్మకంగా గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్ (ఏఏటీ) లోగోను సోమవారం కలెక్టర్ ఎ.మల్లికార్జున విడుదల చేశారు. డిసెంబర్ 15వ తేదీ నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు 51 రోజులపాటు పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు విశాఖ వేదిక కానుంది. పోటీల్లో పాల్గొనే ఆటగాళ్లు ఆన్‌లైన్ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలి. సోమవారం నిర్వహించిన సమావేశంలో జేసీ విశ్వనాథన్, సెట్విస్ సీఈవో కీర్తి, డీఎస్ఏ చీఫ్ కోచ్ గాలియట్, ఏసీపీ బాపూజీ, జిల్లా రెవెన్యూ అధికారి కే.మోహన్‌కుమార్, జీవీఎంసీ అదనపు కమిషనర్ వర్మ, పూర్ణిమదేవి పాల్గొన్నారు.

ఐదు క్రీడాంశాల్లో..

ఆడుదాం ఆంధ్రలో ఐదు క్రీడాంశాల్లో పోటీలు జరగనున్నాయి. క్రికెట్, బాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీతో పాటు ఖోఖో పోటీలు నిర్వహించనున్నారు. నగదు పారితోషికాలతో జట్లను ప్రోత్సహించనున్నారు.

పేర్లు నమోదు చేసుకోండి

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్ర టోర్నీ నిర్వహిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈవెంట్ నిర్వహిస్తుంది. ఐదు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నాం. గ్రామ, వార్డు స్థాయిలో పదిమంది స్పోర్ట్స్ వలంటీర్లను ఎంపిక చేసి శిక్షణ నిచ్చాం. aadudamandhra.ap.gov.inలో లాగిన్ అయి పేర్లను నమోదు చేసుకోవచ్చు. 1902 నంబర్‌కు కాల్ చేసికూడా నమోదు చేసుకోవచ్చు.

– మల్లికార్జున, జిల్లా కలెక్టర్, డీఎస్ఏ చైర్మన్

నేటి నుంచి సమ్మేటివ్ పరీక్షలు

ఏర్పాట్లు పూర్తి: డీఈవో చంద్రకళ



భీమిలి ఎమ్మార్సీలో ప్రశ్నా పత్రాలను సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు

విశాఖ విద్య: జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో సమ్మేటివ్ -1 పరీక్షలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ(ఎస్సీఈఆర్టీ) నుంచి జారీ అయిన షెడ్యూల్ అనుగుణంగా డిసెంబర్ 8 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఒకటి నుంచి 6వ తరగతి వరకు అదే విధంగా 8,10వ తగరతి విద్యార్థులకు రోజూ ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించనున్నారు. 7,9వ తరగతి విద్యార్థులకు రోజూ మధ్యాహ్నం 1.30గంటల నుంచి 4.45 వరకు పరీక్ష ఉంటుంది. ఇందుకోసమని జిల్లా విద్యాశాఖాధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని 1,389 పాఠశాలలకు చెందిన 3,91,736 మంది విద్యార్థులు సమ్మేటివ్ పరీక్షలకు హాజరుకానున్నారు. వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేసేలా నిర్వహిస్తున్న పరీక్షలు కావటంతో డీఈవో ఎల్. చంద్రకళ తమ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. పరీక్షలకు సంబంధించిన ప్రశ్నా పత్రాలను రాంజీ హైస్కూల్‌లోని స్టాక్ పాయింట్ నుంచి జిల్లాలోని అన్ని ఎమ్మార్సీలకు సరఫరా చేశారు. ఆయా మండలాల విద్యాశాఖాధికారుల సమక్షంలో ఎమ్మార్సీ సిబ్బంది వీటిని పాఠశాలల వారీగా బండిల్స్‌ను సిద్ధం చేశారు. డిసెంబర్ 9న అన్ని పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి, ఆ రోజు జవాబు పత్రాలను అందజేసి, వీటిపై సమీక్ష చేయనున్నారు. సమ్మేటివ్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని డీఈవో ఎల్. చంద్రకళ తెలిపారు.

జూలో అలజడి

- యానిమల్ కీపర్‌పై ఎలుగుబంటి దాడి
- ఎన్‌క్లోజర్‌లోనే యువకుడి మృతి



యానిమల్ కీపర్ నగేష్ మృతదేహంపై గాయాలు పరిశీలిస్తున్న ఆరిలోవ పోలీసులు, జూ సిబ్బంది

ఆరిలోవ : విశాఖ జూలో కలకలం రేగింది. ఎలుగుబంటి దాడిలో యానిమల్ కీపర్ నగేష్‌బాబు మృతి చెందాడు. సోమవారం ఉదయం 8 గంటలకు నగేష్ డ్యూటీకి వచ్చాడు. 9 గంటలు సమయంలో ఎలుగుబంటిని డేక్రాల్‌లోకి విడిచిపెట్టడానికి వెళ్లాడు. నైట్ క్రాల్‌లో ఉన్న ఎలుగుబంటిని లిఫ్ట్ డోర్ తెరిచి డే క్రాల్ (సందర్శకులు చూసే ఎన్‌క్లోజరు)లోకి విడిచిపెట్టాడు. మళ్లీ ఆ డోర్ మూయడం మరిచిపోయి నైట్‌క్రాల్‌ను శుభ్రం చేస్తుకొంటున్నాడు. ఆ ఎలుగుబంటి తెరిచి ఉన్న డోర్ ద్వారా డే క్రాల్ నుంచి మళ్లీ నైట్‌క్రాల్‌లోకి ప్రవేశించి నగేష్‌పై దాడిచేయగా అక్కడిక్కడే మృతి చెందాడు.

నిర్లక్ష్యమే కారణమా

జూలో జరిగిన సంఘటనపై ఇది ఎవరి నిర్లక్ష్యమో తెలియని పరిస్థితి నెలకొంది. యానిమల్ కీపర్ నగేష్‌బాబు నిర్లక్ష్యంతో డోర్ మూయకుండా ఉండటం ఒక్కటే కారణమా అనే దానిపై సందర్శకులు నుంచి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎలుగుబంటి దాడి చేసినప్పుడు సాధారణంగా యానిమల్ కీపర్ కేకలు వేసి ఉంటాడు. అక్కడే అందుబాటులో ఉన్న సెక్యూరిటీ గార్డు ఆ కేకలు విని వెళ్లాల్సి ఉంది. అయినా సంఘటన జరిగిన గంట తర్వాత డాక్టర్ వచ్చి పిలవమన్నంతవరకు ఆ గార్డు వెళ్లలేదు. ఆ ఎన్‌క్లోజరు కొండ అంచున ఉంది. తోడు లేకుండా ఒక్క కీపర్ మాత్రమే నైట్‌క్రాల్‌లోకి వెళ్లి గంటన్నర వరకు తిరిగి రాకపోయినా ఎవ్వరూ పట్టించుకోకపోవడం విశేషం. ఆ సమయంలో అక్కడ బాధ్యతలు చూడాల్సిన జూ అధికారులు ఆచూకీ దరిదాపుల్లో కనిపించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణంగా రేంజర్, సెక్షన్ ఆఫీసర్ ఆ సమయంలో రౌండ్స్ వేస్తూ అన్ని నైట్‌క్రాల్స్, డే క్రాల్స్ పర్యవేక్షించాల్సి ఉంది. ఇదిలా ఉండగా నగేష్ ..భవానీమాల ధరించారు. ఎలుగుబంటి తిరిగి నైట్‌క్రాల్‌లోకి వచ్చి ఆయన వేసుకొన్న ఎరుపు రంగు బట్టలకు ప్రతిస్పందించి దాడి చేసిందా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

అనుభవంలేని కీపర్..

గతంలో ఇక్కడ ఎలుగుబంటి ఎన్‌క్లోజరు వద్ద అనుభవజ్ఞుడైన యానిమల్ కీపర్‌ను ఏడాదిన్నర క్రితం నిషాచర జీవుల గృహ వద్దకు మార్చేశారు. ఆయన స్థానంలో ఇక్కడ అనుభవంలేని కొత్తగా చేరిన నగేష్‌బాబును నియమించారు. అనుభవం తక్కువ కావడం వల్లే నగేష్‌బాబు తెరిచిన డోరు మూయకుండా నిర్లక్ష్యం వహించాడని సమాచారం.

జూ చరిత్రలో ఇది రెండో సంఘటన..

విశాఖ జూ చరిత్రలో ఇలాంటిది రెండో సంఘటన. సుమారు 20 ఏళ్ల క్రితం ఎలుగుబంటి ఎన్‌క్లోజరులో శుభ్రం చేస్తున్న జూ మహిళా సిబ్బందిపై కూడా దాడి జరిగింది. ఎలుగుబంటి దాడిచేయడంతో ఆ మహిళ మృతి చెందింది. మళ్లీ సోమవారం జరిగిన ఎలుబంటి దాడిలో యానిమల్ కీపర్ మృతి చెందాడు.

కేజీహెచ్‌లో నకిలీ నియామకాల కలకలం

- సూపరింటెండెంట్ పేరుతో నియామక ఉత్తర్వులు
- షిఫ్ట్ ఆపరేటర్ పోస్టుకు నకిలీ ఆర్డర్‌తో కార్యాలయానికి యువకుడి రాక
- ఆ అపాయింట్‌మెంట్ ఆర్డర్ వెనుక సిబ్బంది పాత్ర
- పోలీసులకు ఫిర్యాదు చేయనున్న అధికారులు



పోస్టింగు ఆర్డర్ తీసుకొచ్చి మేనేజర్‌కు చూపిస్తున్న యువకుడు



కేజిహెచ్ సూపరింటెండెంట్ పేరిట నకిలీ ఉత్తర్వుల కాపీ

మహారాణిపేట : కేజీహెచ్‌లో నకిలీ నియామక ఉత్తర్వుల వ్యవహారం కలకలం సృష్టించింది. షిఫ్ట్ ఆపరేటర్ పోస్టుకు సంబంధించి ఒక మహిళ పేరుతో నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్ ఆస్పత్రిలో సంచలనం రేపింది. కేజీహెచ్‌లో పలు పోస్టులకు వైద్యాధికారులు రెండేళ్లుగా భర్తీ ప్రక్రియ చేపడుతున్నారు. ఇప్పటికే మెజార్టీ పోస్టుల నియామకాలు పూర్తి చేశారు. ఇదిలావుండగా షిఫ్ట్ ఆపరేటర్ పోస్టుకు సంబంధించి నియామక పత్రాన్ని ఓ వ్యక్తి కేజీహెచ్ పరిపాలనా విభాగానికి తీసుకొచ్చాడు. ఈ నియామక పత్రం శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ మహిళది. దీనిపై ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు అనుమతితో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, సంబంధిత గుమస్తా, సెక్షన్ పర్యవేక్షకుడు సంతకం కూడా ఉంది. ఆర్డర్ పొందిన మహిళకు పే స్కేల్ కూడా ఫిక్స్ చేశారు. డిసెంబర్ 15వ తేదీలోగా విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో ఉంది. కేజీహెచ్ సూపరింటెండెంట్, అడిషినల్ డీఎంఈ, డాక్టర్ పి.అశోక్ కుమార్ పేరుతో అపాయింట్‌మెంట్ లేఖలో ఉండడాన్ని సిబ్బంది గమనించారు. సదరు మహిళ రాకుండా వేరే వ్యక్తి ద్వారా నియామక పత్రం తీసుకురావడం. నియామకపత్రంలో పలు అనుమానాలుండడంతో కేజీహెచ్ పరిపాలన విభాగం సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించారు. నియామకపత్రం నకిలీదని నిర్ధారణకు వచ్చారు. వెంటనే విషయాన్ని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు.

మరిన్ని నకిలీ ఆర్డర్లు ఉన్నాయా..?

వైద్య ఆరోగ్య శాఖలో ఇప్పటికే నకిలీ ఆర్డర్ల వ్యవహారం కుదిపేసింది. తాజాగా ఇపుడు కేజీహెచ్‌లో కూడా అదే తరహా ఘటన బయటపడింది. ఈ నేపథ్యంలో మరిన్ని నియామకాల విషయంలో ఇటువంటి నకిలీ ఆర్డర్లు ఉన్నాయా..? అన్నది ప్రస్తుతం కేజీహెచ్‌లో చర్చనీయాంశంగా మారింది. దీనిపై లోతైన విచారణ చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసే ఆలోచనలో కేజీహెచ్ అధికారులున్నారు.

కేజీహెచ్ సిబ్బందిపై అనుమానాలు

ఈ నకిలీ ఆర్డర్ వెనుక కేజీహెచ్‌లో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులకు సంబంధం ఉన్నట్టు ఆస్పత్రిలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శాఖాపరమైన విచారణ చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. కేజీహెచ్‌లో ఇటువంటి వ్యవహారాలు ఎన్ని జరిగాయి...? నకిలీ ఉత్తర్వుల వ్యవహారం వెనుక ఎవరెవరున్నారు..? అనే విషయాలపై కేజీహెచ్ అధికారులు దృష్టి సారిస్తున్నారు.

ఇలా జరగడం రెండోసారి



సోమవారం తీసుకొచ్చిన నకిలీ నియామక పత్రం రెండోదిగా గుర్తించాం. గతంలో కూడా ఒక వ్యక్తి ఇలా నకిలీ ఆర్డర్ తీసుకొచ్చాడు. ఇప్పుడు మళ్లీ రావడంతో వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నాం. సంతకాలు, ఫైల్ నంబరు ఒకేలా ఉన్నాయి. దీని వెనుక ఎవరున్నారో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ రోజు పోస్టింగు ఆర్డర్ బయటకు వచ్చింది. రేపు ఇంకా ఏమైనా చేస్తారా అన్న అనుమానం వుంది.

– డాక్టర్ పి.అశోక్ కుమార్, సూపరింటెండెంట్, కేజీహెచ్, విశాఖ

పుష్కరిణీ నమోస్తుతే.. తెల్లారే వరకు..



వరాహ పుష్కరిణి వద్ద వేదికలపై నుంచి నక్షత్ర హారతి అందజేస్తున్న అర్చకులు

- వరాహ పుష్కరిణికి విశేషంగా పుణ్యనదీ హారతి
- గతానికి భిన్నంగా ఎనిమిది మంది అర్చకులతో నక్షత్ర హారతి
- పరవశించిన భక్తజనం.. తిలకించిన శారదా పీఠాధిపతి

సింహాచలం: కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని సోమవారం సాయంత్రం వరాహ పుష్కరిణికి జరిగిన పుణ్యనదీ హారతి(గంగా హారతి) కార్యక్రమానికి భక్తులు పోటెత్తారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ సారి ఎనిమిది మంది అర్చకులు ఒకే సారి వరాహ పుష్కరిణికి ఇచ్చిన హారతిని చూసి పరవశించారు. భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. భక్తులు పుష్కరిణి గట్టుపై పెద్ద ఎత్తున దీపారాధన చేశారు. కోలాటం, నృత్యాలు, సంకీర్తనలతో స్వామిని కొలిచారు. ముందుగా సింహాచలం దేవస్థానానికి చెందిన కొండ దిగువ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి వెంకన్న ఉత్సవమూర్తులను సాయంత్రం 5 గంటలకు తిరువీధిగా వరాహ పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. అక్కడ వేదికపై ఉత్సవమూర్తులు, శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అనంతరం ద్వయ హారతులు, నక్షత్ర హారతి, కుంభ హారతి స్వామికి సమర్పించారు. తర్వాత ఎనిమిది మంది అర్చకులు పుష్కరిణికి ఇరువైపులా ఏర్పాటు చేసిన ఎనిమిది వేదికలపై నిలబడి.. వరాహ పుష్కరిణికి నక్షత్ర హారతులిచ్చారు. అనంతరం పుష్కరిణి గట్టుపై మహిళలు పెద్ద ఎత్తున దీపాలు వెలిగించారు. శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామిని దర్శించుకుని నదీ హారతిని తిలకించారు. ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు భక్తులకు ఇబ్బంది లేకుండా విశేష ఏర్పాట్లు చేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్, సువ్వాడ శ్రీదేవి, ముదుండి రాజేశ్వరి, వంకాయల సాయి నిర్మల తదితరులు పాల్గొన్నారు.



వరాహ, నారసింహ, ప్రహ్లాద వేషధారణలో భక్తులు



కోలాటం ఆడుతున్న చిన్నారులు, మహిళలు

పవిత్రమాసం.. కార్తీకం

మహిమాన్వితమైనది కార్తీక మాసం అని స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ అన్నారు. నదీ హారతి ఉత్సవంలో స్వామీజీ అనుగ్రహభాషణం చేశారు. మహా శివుడు, మహా విష్ణువులకు ఎంతో ఇష్టమైన మాసం కార్తీకమాసం అన్నారు. ఈ సారి సింహాచలం దేవస్థానం ఎంతో వైభవంగా నదీ హారతి కార్యక్రమాన్ని నిర్వహించిందన్నారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తిని ఈ సందర్భంగా అభినందించారు.

ఎగసిపడ్డ మంటలు

- షార్ట్ సర్క్యూట్ కారణంగా షాపింగ్‌మాల్‌లో అగ్నిప్రమాదం
- సోమవారం ఉదయానికి అదుపులోకి వచ్చిన మంటలు
- రాత్రంతా శ్రమించిన అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు
- జస్వంత్ రడీమేడ్స్‌కు రూ.5.60 కోట్లు, ఎస్.కె.రడీమేడ్స్‌కు రూ.7లక్షల నష్టం

తగరపువలస: తగరపువలస ప్రధాన రహదారిలోని జస్వంత్ రడీమేడ్స్‌లో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఎగిసిపడ్డ మంటలు సోమవారం ఉదయం వరకు కొనసాగాయి. భీమిలి సీఐ డి.రమేష్, తాళ్లవలస అగ్నిమాపకశాఖాధికారి శ్రీనివాసరాజు తమ సిబ్బందితో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు శ్రమించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. ఇందుకోసం విశాఖకు చెందిన రెండు, విజయనగరం నుంచి రెండు, తాళ్లవలసకు చెందిన ఒక అగ్నిమాపక శకటాలను వినియోగించారు. రామన్నపేటకు చెందిన మాజీ సైనికుడు తమ్మిన నరసింగరావు రెండు ట్యాంకర్లు మంటలు ఆర్పడానికి సహాయపడ్డాయి. అగ్నిమాపక శకటాలకు ఆనందపురం మండలం పెద్దిపాలేనికి చెందిన చెన్నా కన్వెన్షన్ హాలు నుంచి వాటి యజమాని చెన్నా వెంకటేష్ నీటిని సరఫరా చేశారు. ఈ ప్రమాదానికి షార్ట్ సర్క్యూటే కారణమని డీఎఫ్‌వో రేణుకయ్య ధ్రువీకరించారు. కాగా.. ఈ ప్రమాదంలో జస్వంత్ రడీమేడ్స్‌కు రూ.5.60 కోట్లు, ఆ పక్కనే ఉన్న ఎస్.కె.రడీమేడ్స్‌కు రూ.7లక్షలు నష్టం వాటిల్లినట్లు వాటి యజమానులు కటకం సునీత, వెంపాడ సంతోష్ తెలిపారు.

దుకాణాలు ఖాళీ చేశారు

ఆదివారం అర్ధరాత్రి సమయంలో జస్వంత్ రడీమేడ్స్‌లో భారీగా మంటలు ఎగిసి పడటంతో చుట్టుపక్కల వ్యాపారులు ముందు జాగ్రత్తగా తమ దుకాణాల్లోని వస్తువులను ఖాళీ చేసేశారు. రాత్రి గ్యాస్ సిలిండర్లు పేలి మంటల తీవ్రత ఎక్కువ కావడంతో ఎస్.కె.రడీమేడ్స్ దుకాణం కాలిపోయింది. సిబ్బంది ప్రాణాలకు తెగించి షాపింగ్‌మాల్‌కు ఆనుకుని దుకాణాల గోడలకు కన్నాలు పెట్టి వేడి బయటకు వచ్చేలా చేశారు. సోమవారం ఉదయానికి మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చినా.. షాపింగ్‌మాల్ నుంచి వేడి పొగలు వస్తూనే ఉన్నాయి. అదృష్టవశాత్తూ షాపింగ్‌మాల్‌లో యజమానురాలు ఉంచిన నగదు, బంగారు ఆభరణాలు సురక్షితంగా ఉన్నాయి.



పూర్తిగా కాలిపోయిన జస్వంత్ షాపింగ్‌మాల్



ఎస్.కె రడీమేడ్స్ దుకాణంలో కాలిన దుస్తులు

బాధితులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి పరామర్శ



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సోమవారం బాధితులను పరామర్శించి వారికి ప్రభుత్వం, బీమా సంస్థల నుంచి నష్టపరిహారం వచ్చేలా కృషి చేస్తామన్నారు. అనంతరం డీఎఫ్‌వోతో మాట్లాడారు. ఇలాంటి అగ్నిప్రమాదాల నుంచి రక్షణగా ప్రతీ వ్యాపారి అగ్నిమాపక నిరోధ పరికరాలు ఏర్పాటు చేసుకునేలా వర్తక సంఘం ప్రతినిధులకు చెబుతామన్నారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, జగుపల్లి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, కొప్పల రమేష్ తదితరులు ఉన్నారు.

సామాజిక స్పృహ కలిగించేవి నాటికలు

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- ముగిసిన వైజాగ్ జూనియర్ థియేటర్ ఫెస్ట్

బీచ్‌రోడ్డు: నేటి బాలలకు అలనాటి కథలను నాటికల రూపంలో తెలియజేసి.. మంచి, చెడును వివరించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పిలుపునిచ్చారు. మూడు రోజులుగా వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో జరుగుతున్న వైజాగ్ జూనియర్ థియేటర్ ఫెస్ట్ సోమవారంతో ముగిసింది. ముగింపు వేడుకల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ పాఠశాలల్లోని డిజిటల్ తరగతి గదుల్లో ఇలాంటి నాటికలను ప్రదర్శించాలన్నారు. తారస్ ట్రియో, మాల్గుడి డేస్ నాటికలు పిల్లలకు వినోదంతో పాటు సమాజం పట్ల అవగాహన పెంపొందించాయన్నారు. తెలుగు విద్యార్థుల కోసం బరిబతల రాజా నాటికను ప్రత్యేకంగా ప్రదర్శింపజేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని తెలుసుకోవడానికి ఇలాంటి ప్రదర్శనలు ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. భవిష్యత్‌లో థియేటర్ ఫెస్ట్‌ను మరింత ఆసక్తికరంగా కొనసాగించాలని నిర్వాహకులను సూచించారు. వీఎంఆర్డీఏ జాయింట్ సెక్రటరీ రవీంద్ర, పైడా కృష్ణప్రసాద్, కంకటాల మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్

చుట్టూ ఉన్న వారి ఆనందమే మన ఆనందం

చుట్టూ ఉన్న వారు ఎలా పోయిన ఫర్వాలేదు.. మనం సుఖంగా, ఆనందంగా ఉంటే చాలు అనుకుంటే ఏదో ఓ రోజు మనల్ని ఎవరో ఒకరు మోసం చేస్తారు. ఇదే కథతో బరిబతల రాజా నాటికను హైదరాబాద్‌కు చెందిన కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. ఓ రాజు రాజ్యం కోసం కాకుండా కేవలం తన ఆనందం కోసం వస్త్రాలపై అధిక శ్రద్ధ చూపిస్తాడు. ఈ విషయాన్ని గమనించిన కొందరు ఆయనకు మాయ మాటలు చెప్పి.. మోసం చేస్తారు. ప్రజల ముందు అవహేళనకు గురి చేస్తారు. దీంతో ఆ రాజుకు జ్ఞానోదయం అవుతుంది. మన చుట్టు ఉన్న వారు ఆనందంగా ఉంటే.. మనం కూడా ఆనందంగా ఉంటామని భావించి.. రాజ్యంలో ప్రజల సుఖసంతోషాల కోసం పనిచేస్తాడు. ఈ కథను కళాకారులు వినోదాత్మకంగా.. పిల్లలకు అర్థమైన రీతిలో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అలాగే ముంబయికి చెందిన కునాల్ మోట్లింగ్, సందేశ్ సంజయ్‌లు ప్రదర్శించిన మైమ్ ప్రదర్శన చిన్నారులు, పెద్దలను విశేషంగా అలరించింది. కేవలం హావభావాలు, వ్యక్తీకరణాల ద్వారా నవ్వించడంతో పాటు మంచి సందేశమిచ్చారు.

బాలికను వేధించి.. సొమ్ము దోచేసి..

9వ తరగతి విద్యార్థినికి సోషల్ మీడియాలో బెదిరింపులు

కూర్మన్నపాలెం: సోషల్ మీడియా వేదికగా 9వ తరగతి చదువుతున్న బాలికను వేధిస్తూ డబ్బులు దోచేసిన వ్యక్తిపై దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివీ.. దువ్వాడ స్టేషన్ పరిధిలోని ఓ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న బాలిక రోజూ లాగానే ఈ నెల 22న స్కూల్‌కి వెళ్తున్నా అని ఇంట్లో చెప్పి.. స్కూల్‌కు వెళ్లకుండా ఎటో వెళ్లిపోయింది. దీంతో ప్రిన్సిపాల్ ఆమె తల్లికి ఫోన్ చేసి.. బాలిక స్కూల్‌కు రాలేదని చెప్పారు. కంగారు పడిన ఆమె స్కూల్‌కి వెళ్లి ఆరా తీసింది. సాయంత్రం వరకు అక్కడే ఉంది. స్కూల్ ముగిసే సమయానికి వచ్చిన బాలికను ఎక్కడకు వెళ్లావని ప్రశ్నించగా.. ఏడుస్తూ ఉండిపోయింది. ఇంటికి తీసుకువెళ్లి ప్రశ్నించగా.. సోషల్ మీడియాలో ఓ వ్యక్తి బెదిరిస్తున్నాడని చెప్పింది. దీంతో తల్లితో పాటు పాఠశాల సిబ్బంది బాలికను ఫాలో అయ్యారు. తర్వాత రోజు బాలిక ఆటోలో వస్తుండగా.. ఆటోను ఓ కారు ఫాలో అవ్వడం గమనించారు. తర్వాత స్కూల్ పక్కనే ఉన్న వీధిలో బాలిక ఓ వ్యక్తితో మాట్లాడటం గుర్తించి.. గట్టిగా నిలదీశారు. దీంతో బాలిక విస్తుపోయే నిజాలు చెప్పింది. 'మార్చిలో నా స్నేహితురాలి పేరుతో వాట్సాప్‌లో ఓ మేసేజ్ వచ్చింది. ఓ న్యూడ్ వీడియో పంపి.. నన్ను కూడా అలాగే పంపమని మేసేజ్‌లో ఉంది. నేను అలానే చేశా. రెండు రోజుల తర్వాత స్కూల్‌కి వచ్చి నా ఫ్రెండ్‌ను వీడియో గురించి అడిగాను. తనకు ఏమీ తెలియదని, ఆ నంబర్ కూడా తనది కాదని చెప్పింది. దీంతో అదే రోజు వాట్సాప్‌లో న్యూడ్ వీడియో పెట్టిన వ్యక్తిని ఎవరు మీరు అని ప్రశ్నించాను. అతను నువ్వు నాకు తెలుసు.. లక్ష రూపాయలు ఇస్తే వీడియో డిలీట్ చేస్తాను. లేదంటే వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తాను అని బెదిరించాడు.' అని వారికి చెప్పింది. అతనికి బయపడిన బాలిక దఫదఫాలుగా రూ. 30 వేలు, రూ.10 వేలు, రూ.5వేలు చొప్పున ఇంట్లో దొంగతనం చేసి బెదిరిస్తున్న వ్యక్తికి ఇచ్చింది. ఇంకా డబ్బులు కావాలని అడుగుతుండడంతో తన దగ్గర లేవని చెప్పింది. అయితే తాను చెప్పినట్లు చేయాలని, తన ఫ్రెండ్‌తో వెళితే వీడియో డిలీట్ చేస్తానని అతను బాలికకు చెప్పాడు. దీంతో ఈ నెల 22న ఉదయం స్కూల్‌కు వెళ్లకుండా యువకుడు చెప్పినట్లుగా ఆ వ్యక్తితో వెళ్లింది. అయినప్పటికీ అతను ఇంకా మూడు లక్షలు తీసుకురావాలని బెదిరిస్తున్నాడని తల్లికి చెప్పింది. ఈ ఘటనపై బాలిక తల్లి దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు వెదుళ్లనరవకు చెందిన మాటూరి సాయిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతనిపై సోమవారం కేసు నమోదు చేశారు.

స్పందన ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

మహారాణిపేట: ప్రజా సమస్యల పరిష్కారం దిశగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. అర్జీదారుల నుంచి స్వీకరించే వినతులను తక్షణమే పరిష్కరించాలన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన)కు 206 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి స్పందనకు ఎంత ప్రాధాన్యమిస్తున్నారో.. డివిజన్, మండల స్థాయిలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి కూడా అంతే ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు. అర్జీదారు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలని, ఫిర్యాదు రీ-ఓపెన్ కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 95, జీవీఎంసీకి 49, పోలీసు శాఖకు 18, ఇతర శాఖలకు సంబంధించి 44 మొత్తం 206 వినతులు వచ్చాయి. జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ఏసీపీ బాపూజీ, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ, డీఎల్‌డీవో పూర్ణిమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కేజీఆర్‌లో మృత శిశువు లభ్యం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రెండవ కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(కేబీఆర్)లో సోమవారం మృత మగ శిశువు లభించింది. స్టీల్‌ప్లాంట్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. కేబీఆర్-2కు చెందిన స్పిల్ గేటు-1 వద్ద కొంత మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారు. వారికి కాలువలో కొట్టుకు వచ్చిన పూల మధ్య నీటిపై తేలుతూ ఒక మృతదేహం కనిపించింది. దీంతో వారు తమ సూపర్‌వైజర్‌కు తెలిపారు. ఆయన స్టీల్‌ప్లాంట్ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ వి.శ్రీనివాసరావు కేబీఆర్‌కు వెళ్లి చూడగా ఇటీవల పుట్టిన మగ శిశువు చనిపోయి ఉండటం గుర్తించారు. వెంటనే ఆ మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు పంపారు. మూడు రోజుల పాటు కేజీహెచ్‌లో మృతదేహాన్ని ఉంచుతామని ఆయన తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.


జీవీఎంసీకి 96 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ గొలగాని హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం నిర్వహించారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పలువురు నుంచి వినతులు స్వీకరించారు. జోన్-2 పరిధి ఇందిరానగర్-1లో అక్రమ కట్టడాలు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారని పి.వరలక్ష్మి, జోన్-6 పరిధి వుడా ఫేజ్-2లో ట్రాఫిక్ ఐలాండ్‌లు మరమ్మతులు చేపట్టాలని కాకుల శివకుమార్, జోన్-8 పరిధి గ్రామిక్‌నగర్-3లో మంచినీటి సమస్యపై కొణతాల వెంకట అప్పారావు, జోన్-4 పరిధి చిలకపేటలో మురుగునీటి సమస్యపై వంకా మూర్తి, జోన్-5 పరిధి మాధవధారలో అక్రమ మంచినీటి కనెక్షన్లపై సనపల పుండరీకాక్షస్వామి మేయర్ ఫిర్యాదు చేశారు. 655 మంది క్లాప్ వాహన, ఈ-ఆటోల లోడర్లకు సంబంధించిన టెండర్లు ప్రభుత్వ, కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా ఉన్నాయని జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వీవీ వామనరావు అన్నారు. తక్షణమే ఈ టెండర్లను నిలుపుదల చేయాలని మేయర్‌కు ఫిర్యాదు చేశారు. కాగా.. డయల్ యువర్ మేయర్‌కు 8 ఫిర్యాదులు, జగనన్నకు చెబుదాంకు 96 వినతులు అందాయి. నిర్ణీత సమయంలో అర్జీలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను మేయర్ ఆదేశించారు. అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, సీసీపీ సురేష్, సీఎంవోహెచ్ డాక్టర్ నరేష్‌కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, కార్యదర్శి పి.నల్లనయ్య, డీడీ(హార్టికల్చర్) దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను వేధిస్తున్న వారిపై కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

దొండపర్తి: 'కొడుకు, కోడలు ఇద్దరూ.. ఇల్లు, స్థలం డాక్యుమెంట్లతో పాటు రూ.3 లక్షలు నగదు తీసుకొని తిండి పెట్టడం లేదు. కుమార్తెలు దగ్గరకు పంపించేసి వాళ్లని కూడా బెదిరిస్తున్నారు' అని వెంకటాపురం ప్రాంతానికి చెందిన 79 ఏళ్ల వృద్ధుడు..

'కొడుకు తన ఇంట్లోకి చొరబడి కత్తితో గాయపరిచి తన వద్ద ఉన్న ఇంటి పత్రాలు, ఫోన్, వాహనం, పెళ్లికాని కుమార్తె కోసం ఉంచిన రూ.40 వేలు నగదు తీసుకొని వెళ్లిపోయాడు' అంటూ ఆరిలోవకు చెందిన 70 ఏళ్ల వృద్ధుడు.. ఇలా నలుగురు వృద్ధులు తమ పిల్లలు పెడుతున్న చిత్రహింసలపై నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 56 ఫిర్యాదులు రాగా.. ఇందులో నలుగురు వృద్ధులు తమను కుటుంబ సభ్యులు వేధిస్తున్నారంటూ సీపీకి విన్నవించారు. ఈ ఫిర్యాదులపై సీపీ స్పందిస్తూ వృద్ధులను ఇబ్బందులు పెడుతున్న కుటుంబ సభ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత స్టేషన్ అధికారులను ఆదేశించారు. ఏడీసీపీ(ఎస్బీ) ఇ.నాగేంద్రుడు, లీగల్ అడ్వైజర్ పి.వి రామకృష్ణ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

వాంబేకాలనీలో గ్యాస్ లీకేజీ ఘటన

పీఎంపాలెం: జీవీఎంసీ 7వ వార్డు వాంబే కాలనీలో జరిగిన గ్యాస్ లీకేజీ ఘటనలో బాలరాజు చిన్న కుమారుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు గాయపడిన సంగతి తెలిసిందే. పీఎంపాలెం ఎస్ఐ కె.సురేష్‌కుమార్ తెలిపిన వివరాలివీ. ఈ నెల 24వ తేదీ ఉదయం ఆరు గంటలకు వాంబే కాలనీ 27 బీ బ్లాకు ఎఫ్ఎఫ్ 2 లో వంట గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. ఈ ఘటనలో యనమల బాలరాజు, అతని భార్య చిన్ను, పెద్ద కుమారుడు గిరి, చిన్న కుమారుడు కార్తీక్(20) కాలిపోయారు. అధిక శాతం కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కార్తీక్ సోమవారం మరణించాడు. మిగతా ముగ్గురు చికిత్స పొందుతున్నారని ఎస్ఐ సురేష్‌కుమార్ తెలిపారు.